
# శిల్పం

వేపగంతుల మల్లికార్జునరావు



సుబ్బరామయ్యకు చిన్నప్పుడు రెండు కోరికలుండేవి. ఒకటి యమ్మేస్సీ చదవాలని, రెండు కలెక్టరు కావాలని. పాపం అతని యీ రెండు కోరికలు నెరవేరలేదు. ఇంటర్‌తో చదువాగిపోయింది. సెకండరీగ్రేడు ట్రయినింగయి బ్రతుకుతెరువు కోసం బడిపంతులయ్యాడు.

ఇటు యింట్లోనూ అటు స్కూల్లోనూ కూడా ఆయన నడవడి, ప్రవర్తన, కొన్ని మౌలికమైన సిద్ధాంతాలకు కట్టుబడివుండేవి. క్రమశిక్షణ ఆయన వూపిరి. బళ్లో పిల్లలు ఆయన్ని ఎంతగా ప్రేమించి అభిమానిస్తారో అంతగా ఆయనంటే భయపడ్తారు. గౌరవిస్తారు.

ప్రైవేట్లు చెప్పి పంతుళ్ళందరూ రెండు దోసిళ్ళతో సంపాదిస్తుంటే సుబ్బరామయ్య ఆవూసెత్తితేనే మండిపడేవాడు. క్లాసులో ఆయనలా శ్రద్ధగా పాఠం చెప్పేవారెవరూ లేరని జిల్లాలోనే ప్రసిద్ధి. యింట్లో దరిద్రదేవతను బంధించేసి,

జిల్లాలో గొప్ప ఉపాధ్యాయుడుగా పేరు సంపాదించాడు. నీతినిజాయితీలున్న మనిషన్న బిరుదు పొందేడు.

సుబ్బరామయ్య చిన్నతనంలో తనకు తీరని కోరికల్ని తనపిల్లలద్వారా తీర్చుకోవాలనుకొన్నాడు. కాని అక్కడా ఆయనకు చుక్కే ఎదురయింది. ఒకే ఒక్క కూతురు పుట్టింది. ఆ తర్వాత మరి పిల్లలు పుట్టలేదు.

అందుకు సుబ్బరామయ్య పెద్దగా విచారించలేదు. యిటు స్కూల్లో తోటి ఉపాధ్యాయులు, అటు యిరుగు పొరుగు వాళ్ళ మాటలు ఆయన్ని బాధపెట్టేయి.

'ఆ ఒక్క నలుసు మగబిడ్డయితే ఎంతబాగుండేది పాపం ?'

'ఎంతైనా ఆడపిల్ల ఆడపిల్లే. రేపు వో అయ్యచేతిలో పెట్టాల్సిందేకదా ?'

'పుత్రుడేకదయ్యా పున్నామనరకం నుంచి తప్పించేది. దత్తత తీసుకుంటే సరి.

యిలాంటి ఛాందసపుమాటలు విని విని సుబ్బరామయ్యలో పట్టుదల హెచ్చింది. కూతురు హేమసుందరిని కొడుకులాగే పెంచేడు. తనకోరికలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా ఆమెను చిన్నతనంనుంచి మలచసాగేడు.

హేమసుందరి అజంతా చిత్రమంత అందంగాఉంటుంది. చోళుల లోహవిగ్రహాలలోని తేజస్సు, చాళుక్యుల శిల్పాల లోని వర్చస్సు ఆమెలోవుంది. ఎంత రూపసో అంత తెలివిగలది. సరస్వతీదేవి ఆమె నాలుకమీద తిష్ఠ వేసిందా అన్నంత తెలివితేటల్తో ఎక్కొచ్చింది చదువులో,

టెన్త్‌క్లాసు స్టేటు వస్టుగా పాసయిన్నాడు వూరికళ్ళన్నీ ఆమెమీదే వున్నాయి. అసూయను ఆపుకోలేక నలుగురూ నాలుగు కూసేరు.

'ఆడపిల్ల ఏం వస్టువచ్చి ఏంలాభంలే'

'బియ్యేలు యమ్మేలు చదివి కలెక్టరవుతుందా ?'

'ఏంచదివినా ఆడపిల్లన్నాక పెళ్ళి చేసుకోక తప్పుతుందా ? పిల్లల్ని కనక తప్పుతుందా ? పాపం! అదే మగపిల్లవాడయివుంటే సుబ్బరామయ్య...'

అంతటతో వూరుకోలేదు. ఎవరో వో సంబంధం పట్టుకొచ్చారుకూడా.

సుబ్బరామయ్య పట్టుదల మరీ పెరిగింది.ఆ సంబంధాన్ని కాలిగోటితో తోసిపారేసి హేమసుందరిని కాలేజీలో చేర్చాడు.

నిజానికి పిల్లకు కాలేజీ చదువు చెప్పించేటంత శక్తి సుబ్బరామయ్యకు లేదు. పైగా యింట్లో తల్లిపోరు, పెళ్ళాంపోరు 'పెళ్ళిచెయ్యి పెళ్ళిచెయ్యి' అని.

'పదిహేనేళ్ళునిండని పిల్లకు అప్పుడే పెళ్ళి బేరాలా? ఛీ...' అనుకొని అప్పటికీ కూతుర్ని అడిగేడు

'మీ యిష్టం నాన్నా' అంది ఆ పిల్ల. మురిసిపోయాడు సుబ్బరామయ్య.

హేమసుందరి తను చెక్కుతున్న శిల్పం. శిల్పాన్ని ఎలామలచాలో యీ అజ్ఞానులకు, మూఢులకేంతెల్సు? శిల్పి కనుక తనకు తెల్సు. ఆ బాధ్యత తనది

"కాలేజీలో చేర్తావా తల్లీ"

"చేరుతానువాన్న నాకూఆదేయిష్టం"

* *

హేమసుందరి బియస్సీ యూనివర్సిటీ ఫస్టుగా పాసయింది. అయినవాళ్ళు కానివాళ్ళకూడా సుబ్బరామయ్యను అభినందిస్తున్నట్లే నటిస్తూ హేమసుందరి ఆడపిల్ల అన్న విషయాన్ని గుర్తుచేశారు. మగపిల్లవాడు లేడన్న సానుభూతి చూపేరు ఆడపిల్లకు చదువు కన్నా పెళ్ళి ముఖ్యం అని మందలించారు.

"పిల్ల కలకత్తా జామపండులా మెరిసిపోతోందిరా. చెరుగ్గడలా ఎదిగిపోయింది. పెళ్ళి మాటేం చేశావు?" తల్లిపోరు, భార్యపోరు పడలేక ఎవరో హేమసుందరిని చూడటానికి వస్తామంటే పెళ్ళి చూపులకి అంగీకరించాడు సుబ్బరామయ్య

పెళ్ళికొడుకు యింజనీరింగ్ చదువుతున్నాడు డబ్బున్న కుటుంబం పిల్లవాడు కాస్త నలుపుబారు. ముందుపన్ను ఒకటి కాస్త ఎత్తు.

చూడటాని కొచ్చినవాళ్ళు పెళ్ళి ఉత్తరం రాస్తామంటూ నాన్చలేదు. కట్నాల బేరాల్లోకిదిగలేదు పిల్లనచ్చింది. మంచిముహూర్తం పెట్టించండంటూ తొందర పెట్టేరు.

కట్నం అడుగుతారు. తనెలాగూ యిచ్చుకోలేడు కనుక పెళ్ళి ఎలాగూ కాదన్న ధీమాలో పెళ్ళిచూపులకొప్పుకొన్నాడు సుబ్బరామయ్య. తీరా యిప్పుడు 'ఊ' అంటే చాలు పెళ్ళిచేసుకొని పెళ్ళాన్ని తీసుకెళ్ళి, పిల్లల్ని కనేసేలా తొందరపడుతున్నాడు పెళ్ళికొడుకు.

డబ్బు, చదువు వుండగానే సరా? తన బంగారు బొమ్మని ఆ నల్లతుమ్మ మొద్దుకు కట్టిపెట్టటమా? ఆ సంబంధాన్ని తప్పించేసరికి సుబ్బరామయ్య తలప్రాణం తోకకొచ్చింది.

"మొగాడికి అందం ఏమిట్టా?"— భార్య పొడిచింది.

"తనేమంత అందగాడని నిన్ను చేసుకొన్నాడో అడగవే" తల్లి చెప్పింది.

ఇరవైనాలుగ్గంటలూ వాళ్ళు సతాయిస్తుంటే భరించలేక మరో సంబంధం వాళ్ళని పెళ్ళిచూపులకు రమ్మన్నాడు.

అందంలో పిల్లవాడు పిల్లకేమాత్రం తీసిపోడు. కానీ చదువు లేదు. పల్లెటూళ్ళో స్వంత వ్యవసాయం. కట్నాలేమంత అడగలేదు. వాళ్ళు. పిల్ల గుణం మంచిదై కుటుంబంలో కల్సిపోతే చాలనుకొన్నారు. పిల్లనచ్చిందని కబురు పెట్టేరు.

కాని సుబ్బరామయ్య మరోవిధంగా

ఆలోచించ్చాడు బియస్సీ వస్తులో పాసయిన పిల్లను చదువులేనివాడికివ్వ టమా? పైగా రాజప్రాసాదాల్లో రంగు టద్దాలమధ్య వుండాల్సిన తన శిల్పం పేదపిసుకుతూ పిడకలుచేస్తూ వుండ టాన్ని సుబ్బరామయ్య వూహించలేక పోయాడు. దాన్ని పడనివ్వలేదు.

"ఇంతకీ మీకు దాని పెళ్ళి చేద్దామని వుందా లేదా చెప్పండి" నిలేసింది భార్య

తనకోరికల్ని వూహల్ని మూర్ఖులకి చెప్పి లాభమేమిటి? సంబంధాలుమాత్రం రావటం మానలేదు. గుమాస్తా అని వొకడిని, కంపార్టుమెంటులో బి.ఎ. పాసయ్యాడని మరొకడిని, యిలా ఏదో వంకపెట్టి దేన్నీ పడనివ్వలేదు సుబ్బ రామయ్య.

యీతడవ ఆడంగులు హేమసుందరి మీద పడ్డారు "యింత చదివేవు తెలివి తేటలున్నాయి. వయసొచ్చిన పిల్లవు ఆయనలా యింటిముందుకొచ్చిన సంబం ధాల నన్నిటిని చెడగొట్టుంటే నోరు తెరిచి మాట్లాడవేమే. అందంగావున్నా నని సంబరపడ్తున్నావేమో. రేపుయీడు దాటితే నీ పెళ్ళెలా అవుతుంది?

"నన్నేం చేయమంటావే. నాన్న యిష్టం అన్నాగా."

రహస్యంగా కూతురన్న ఆ మాట విని సుబ్బరామయ్య పొంగిపోయాడు. "నా తల్లే – నా బంగారు శిల్పమే" అని మురిసిపొయ్యాడు.

"యమ్మెస్సీ చదువుతావా తల్లీ?"

"మీ యిష్టం నాన్నా" అంటూనే అప్లి కేషన్ పూర్తిచేసి పంపించింది.

"బాగా ఆలోచించారా? మనతాహ తెంత? మనమెంత? దానికిప్పుడు యమ్మెస్సీ ఎందుకు? చదివినంతవరకు చాలదూ? యింకా చదివితే మొగుడి నెక్కడినుంచి తీసుకొస్తావు?"

"నీదంతా చాదస్తంలే అమ్మా" అంటూ స్కూలుకెళ్ళేడు సుబ్బరామయ్య

ఆ రోజు స్కూలు యినస్పెక్షన్. డియివోగారు వచ్చారు. అప్పటికేఆయన హేమసుందరిగురించి విన్నాడు. ఉపా ధ్యాయుడిగా సుబ్బరామయ్యమీద ఆయ నకి గొప్ప అభిప్రాయముంది

సహాయం చేద్దామన్న వుదేశ్యంతో సుబ్బరామయ్యను పిలిపించి కూతురికి ఆఫీసులో ఉద్యోగం యిస్తానని అన్నాడు, "డిపార్టుమెంటులో చేరితే ముందుముందు యమ్మెస్సీ చదువుకో వచ్చు. బి.యి.డి. చేయవచ్చు. పైకి పోవటానికి నాసహాయం ఎలాగూ వుంటుంది నాకు తెలివిగల పిల్లంటే చాలాయిష్టం ఆలోచించండి మాస్టారూ"

సుబ్బరామయ్య మొదట్లో సంతో షంతో తబ్బిబ్బియ్యాడు. కాని అంత లోనే అది పేద బడిపంతులి సంతోషం అనిగ్రహించాడు. మరుక్షణంలో శిల్పి అయ్యాడు. కాబోయే కలెక్టర్ తండ్రిగా మారేడు.

"మీదయకు కృతజ్ఞుడనుసార్. కాని మా పిల్లని యమ్మెస్సీలో చేరుస్తున్నాను. యివాళే అప్లికేషన్ పంపింది."

అంతటితో ఆగితే బాగుండేది.

"అయినా గుమస్తా బిడ్డలు గుమాస్తాలు, బడిపంతుళ్ళ బిడ్డలు బడిపంతుళ్ళే గుమాస్తాలే కావాలని ఎక్కడుందిసార్. నాకూతురు తెలివిగలది. గుమాస్తానుచేసి దాన్ని చంపను ఐ. ఏ. యస్. పరీక్షకు కూర్చోపెట్టి కలెక్టర్‌ని చేస్తాను",

డియివో గారి మొహంలో నెత్తురు చుక్క మిగలలేదు.

* *

యమ్మెస్సీలో చేర్చటంతోపాటు హేమసుందరిచేత ఐ ఏ.యస్. పరీక్షకు అప్లై చేయించాడు "ఆ యమ్మెస్సీ అయిందాకా ఆగరాదటయ్యా.నీ తొందర పాడుగాను" అవి అన్నారెవరో సుబ్బరామయ్య లక్ష్యపెట్టలేదు. కాగా పట్టుదల పెరిగింది.

అయితే యీసారి సుబ్బరామయ్య ఆశించినట్లు జరగలేదు. ఐ.ఏ.యస్. రిటన్‌లోనే తప్పింది హేమసుందరి. "ఏంచేయాలి నాన్నా" అంటూ దిక్కు మొహంవేసిన కూతుర్ని చూచి కరిగి పోయాడు. "ఎక్కడో నేనే పొరపాటు చేశాను. శిల్పానిదేం తప్పులేదు. శిల్పిదే లోపం" అనుకున్నాడు.

యమ్మెస్సీ అయేలోగా మరోసారి ఐ.ఏ.యస్. పోవటంతో యీ భావం మరీ దృఢమయింది, సుబ్బరామయ్యలో. కానీ పొరపాటు ఏమిటన్నదిమాత్రం అంతు బట్టలేదు. "పోనీలేమ్మా, ముందా యమ్మెస్సీ కానియ్. యూనివర్సిటీ ఫస్టు వస్తావు. నాకు తెల్సు. ఆ తర్వాత ఐ.ఏ యస్. ఎలాకావో నేనుచూస్తాగా?"

హుషారిచ్చి కూతుర్ని పంపించాడు కాని అప్పటికే ఆయన ఆశలకి, కోరికలకి ఎక్కడో పగుళ్ళు పడ్డట్టు అని పించింది. సహజజీవనగమనంలో ఏవో అపస్వరాలు విన్పించసాగేయి.

పైగా లౌకికజీవనంలో ఎన్నో సమ్మెటపోట్లు కూతురుచదువుకి. ఐ. ఏ. యస్. పరీక్షలకి చేసిన అప్పులు పెరుగుతున్నాయి. ఉద్యోగంలోనుంచి తప్పుకోవాల్సినకాలం దగ్గరపడ్తోంది పెరుగుతున్న ధరలో - సంసారాన్ని యీదుకు రావటమే కష్టతరమవుతోంది.

"మరో ఆరునెలలు. కాకపోతే సంవత్సరం తర్వాత కూతురు యమ్మెస్సీ. కలెక్టరు. ఆడపిల్ల అయినా చక్కటి ప్రజ్ఞావంతురాలైన పరిపాలకురాలుగా పేరు తెచ్చుకొంటుంది. పెళ్ళిచేసుకొంటుంది పిల్లాడిని కంటుంది..."

కలలు... కోరికలు ...ఆశలు ... కాలం అన్నిటినీ కడుపులో దాచుకొంది.

హేమసుందరి యమ్మెస్సీ పాసయింది. ఫస్టుక్లాసు వచ్చింది. కాని యూనివర్సిటీ ఫస్టుమాత్రం కాదు.

"ఏంచేయను నాన్నా?" అంటూ బేలగా చూచిన హేమసుందరి మొహం చూచి వులిక్కిపడ్డాడు.

"యీ శిల్పం నేను చెక్కిందేనా? ఆ మొహంలో వుండాల్సిన తేజస్సు వర్చస్సు...ఎవరో మసిపూయ లేదు కదా?"

"ఏంనాన్నా? కోపం వచ్చిందా?" కూతురు దీనంగా అనగానే సుబ్బ రామయ్య, కరిగిపోయాడు. "లేదమ్మా నువ్వునా శిల్పానివి. ఎప్పటికీ నీమీద నాకు కోపంరాదు ప్రేమే వుంటుంది" అంటూ కూతుర్ని దగ్గరితీసుకొని ప్రేమగా తలనిమిరేడు.

* *

"ఏమ్మా పెళ్ళిచేసుకొంటావా?"

"మీ యిష్టం నాన్నా."

యిన్నాళ్ళకు కూతురుకోసం సుబ్బ రామయ్య సిన్సియర్‌గా సంబంధాలు చూడసాగేడు.

కూతుర్ని యమ్మెస్సీ చేశాడు. ఒక కోరిక తీరింది. ఐ. ఏ.యస్. పాసై ఎలాగూ కలెక్టర్ అవుతుందన్న ధీమా వుంది. ఆ కోరికా తీరుతుంది. మగపిల్ల ల్లేరనుకొనే వాళ్ళకో మార్గం చూపి నట్లవుతుంది.

కాని హేమసుందరి స్త్రీ అని, పెళ్ళి పిల్లలు అవసరమని సహజమనికూడా ఆయనకు తెల్సు ఐ.ఏ.యస్. కోసం




పెళ్ళిని వాయిదావేయటం ఎంతమాత్రం వాంఛనీయంకాదని యిప్పుడాయనకి తెల్సింది. ఎందుచేతనంటే ఆయన జీవితంలో ఎందరో ఆడ డియివో లను ఇన్‌స్పెక్టర్లని చూచాడు. ఉద్యోగాల్లో చేరిన కొత్తల్లో పాపం వారి మొహం

ఎంత కలకలలాడుతుండేదో ? స్త్రీసహజ మైన సౌకుమార్యం, స్నిగ్ధత జాలువారు తుండేవి. కాని వుద్యోగాల్లో చేరేక చాలా మంది కన్యలుగానే మిగిలిపోయారు. పెళ్ళిళ్ళుకాలేదు. ఉద్యోగాల్లో ప్రమోషన్లు వచ్చాయికాని జీవితంలో ప్రారంభదశ లోనే ఆగిపోయారు. వాడిపోతున్నారు. ఎండిపోతారు.

తన శిల్పం అలా కావటం సుబ్బ రామయ్య ఏనాడూ కోరుకోలేదు. కానీ కలెక్టరు కాబోయే తన కూతురికి భర్తకాదగ్గ అర్హత కలెక్టరుకన్నా పైవా డికే వుందనుకొన్నాడు. అలాంటి సంబంధాలే వెతక సాగాడు.

"మరీ అంత పైచూపులు చూడ కయ్యా సుబ్బరామయ్యా. యమ్మేస్సీ చదివిన పిల్లలందరూ కలెక్టర్లవు తున్నారా ?"

పట్టుదల పెరిగింది వెతికివెతికి కలె క్టరు సంబంధాన్నే పెళ్ళి మాపులకు పట్టు కొచ్చాడు. పిల్లవాడు బాగున్నాడు. ఆస్తివుంది. ఉద్యోగం సరేసరి.

పిల్లనిచూచి వాళ్ళు ఎగిరిగంతేస్తారని ఆశించాడు సుబ్బరామయ్య. కాని పిల్ల వాడి తల్లి పెదవివిరిచింది. "పొడ్డూ పొడుగూ వుండగానే సరిపోయిందా ? మొహంలో కళేదీ?" అని గునిసింది భర్తతో.

పిల్ల నచ్చటం మాట అవతలపెట్టి పిల్లవాడితండ్రి కట్నాంబేరంలోకిదిగేడు.

"మా అమ్మాయి ఐ.ఏ.యస్.కు ఎపియర్ అవుతోంది" అన్నాడు సుబ్బ రామయ్య.

"అయితే అదే కట్నం అనుకో మంటారా ఏమిటి?" అంటూ సుబ్బ రామయ్యను నిలేసి నాలుగూ దులిపి పోయాడు పిల్లవాడితండ్రి.

ఆ తర్వాత పట్టుదలతో తిరిగి ఐ.ఏ. యస్. సెలక్షన్ వచ్చిన కుర్రాడిని, రిటన్ టెస్టులో పాసయినవాడిని పట్టుకొచ్చాడు. ఎవరూ పిల్లనుచూచి పొంగిపోలేదు. బేరం ఆడకుండా వుండలేదు. పిల్లకూడా లెక్చరవుతున్నహామీని కట్నంగా అంగీ కరించలేదెవరూ. పైగా పిల్లకు వంకలు పెట్టేరు. సుబ్బరామయ్యను ఎగతాళి చేసేరు.

"వెధవ కలెక్టరుకాంగానే కొమ్ము లొచ్చాయా ఏమిట్రా? గంతకుతగ్గ బొంతను చూచుకోవాలికానీ"

సుబ్బరామయ్య దిగొచ్చాడు డాక్టరు, యింజనీర్లు, లెక్చరర్లు ... అక్కడా యిలాగే ఎదురుదెబ్బలు తగిలేయి, సుబ్బ రామయ్య కలలు కరిగి నీరుకాసాగేయి.

*   *

రిటైర్ మెంటురోజు దగ్గరపడేకొద్దీ సుబ్బరామయ్య ఆందోళన ఎక్కువ కాసాగింది. యిటు కోరికలు తీరలేదు. తను ఎంతో జాగ్రత్తగా, అదంగా, మల చిన శిల్పం ఎందుకో బీటలు వారుతోంది ఊహాలోకంలో అలా వుంటే, నిజజీవి

తంలో మరీ దుర్భరస్థితి. అప్పులు... చాతకానితనం... యిల్లుగడవనిస్థితి.

హేమసుందరి అఖరిఛాన్సుగా ఐ ఏ. యస్. పరీక్ష రాసింది. కానీ అది పాసవుతుందన్న విశ్వాసం. సుబ్బరామయ్యకు లేదు. హేమసుందరికూరా అర్థమైన ఉద్యోగాలకు ధరఖాస్తులు పెట్టసాగింది. జూనియర్ లెక్చరర్ ఉద్యోగంకూడా రాలేదు.

"మీ డియివోగారు అప్పుడెప్పుడో వుద్యోగం యిస్తామన్నారని చెప్పేరుగా యిప్పుడు వాళ్ళ ఆఫీసులో గుమాస్తా వుద్యోగం ఖాళీఅయిందట, ఆ వుద్యోగమన్నా యిమ్మనండి లేకపోతే మీరు రిటైరవుతున్నారుగా. మీ ఖాళీ అయినా మీ కూతురికి యిమ్మనండి."

గుమాస్తా, బడిపంతులు! తను చెక్కిన శిల్పం! తను గీచినచిత్రం! డియివోగారిని అర్థించాడు.

"సారీ సుబ్బరామయ్యా, నాలుగేళ్ళ క్రితం బియస్సీ యూనివర్సిటీ ఫస్టుకున్నవిలువ యీవాళ యమ్మెస్సీకిలేదు. విన్న యమ్మెస్సీపాసయిన నీ కూతురికి నాలుగేళ్ళక్రితం బి.ఎ. పాసయిన వాళ్ళ నొదిలేసి వుద్యోగం యివ్వలేను. ఎంప్లాయ్‌మెంటు ఆఫీసులో పేరు నమోదు చేసుకోమను"

యింటికొచ్చిన సుబ్బరామయ్యకు ఎదురొచ్చి 'ఏమయింది నాన్నా ?' అంది హేమసుందరి, సుబ్బరామయ్య కళ్ళకు




అప్పుడు కూతురుమాసిపోయిన అజంతా చిత్రంలా, పగిలిపోయిన పల్లవ శిలా ప్రతిమలా కన్పించింది!

* *

"యిక యీయన్తో పెట్టుకొంటే లాభంలేదనుకొని సుబ్బరామయ్య తల్లి,

భార్య పూనుకొని హేమసుందరికి సంబంధాలు వెతకసాగేరు. గుమాస్తాలు, సెకండరీగ్రేడు టీచర్చు... అయినాకూడా వొక్కటీ ముడిపడలేదు.

"పిల్ల ముదురుఅండీ, మావాడికి యీడుకాదు."

"మావాడు యస్సెల్సీ. వాడి పెళ్ళాం యమ్మేస్సీ. యిక అకాపురంసాగినట్లే."

'రెండో పెళ్ళి అయితేనేం? మావాడికి పంచాయతీ సమితిలో పర్మనెంటు వుద్యోగం. మొదటి సంబంధంవాళ్ళు పదివేలిచ్చారు. మీరు ఎనిమిదివేలన్నా యిస్తారా?'

చిత్రహింస ననుభవించాడు సుబ్బరామయ్య. యీలాంటి స్థితిలో రిటైర్మెంట్.

రేపు రిటైరవుతాడనగా ఆయన ఉపాధ్యాయుడుగా చేసినసేవకు మెచ్చి ప్రభుత్వం ఏదో బహుమానాన్ని ప్రకటించింది. రిటైర్మెంటు రోజు ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో డియివోగారు స్వయంగా యీ బహుమతిని అందచేస్తారు.

ఆయనకారాత్రి నిద్రపట్టలేదు. ఆనందం వల్లకాదు. ఆలోచనలతో!

తను వోడిపోయాడు కాని ఎందుకు? కారణంఏమిటి? లోపంతనదా? హేమసుందరిదా? బుర్రబద్దలు చేసుకొని ఆలోచించాడు. ఆఖరికి ఆత్మజ్ఞానమయింది?

హేమసుందరిని తను పాలరాయిగా శిలగా, బంగారపు ముద్దగా భావించాడు. దాన్ని తన అభిరుచులకు అనుగుణంగా మల్చాలనుకొన్నాడు. కాని ఆమె ప్రాణంవున్న మనిషి. కోరికలు, ఆలోచనలు, అభిరుచులువున్న మనిషి వాటిని బంధిస్తే, శిల్పం చిట్లింది. జీవకళను కోల్పోయింది

ధ్యేయం మంచిది. కాని దారిలో అన్నీ ఎగుడు దిగుడులే!

ఎప్పుడూ అయిదుగంటలకే నిద్రలేచే సుబ్బరామయ్య, ఆమర్నాడు తెల్లవారిబారెడు పొద్దుపోయినా లేవలేదు. యింట్లో అంతా ఆశ్చర్యపోయారే కాని తలుపుతట్టే సాహసం ఎవ్వరికీలేదు

యింతలో పక్కింటికి పేపరు చూడటానికి పోయిన హేమసుందరి పరుగు పరుగునవచ్చింది. పదిగంటలు దాటినా బడికి రాకపోవటంతో స్కూలు ప్యూను పరుగులెత్తుకొంటూ వచ్చాడు. ఆఖరి రోజాయె! అటెండెన్సు రిజిస్టరులో సంతకం పెట్టకపోతే ఎలా?

"నీ కోరిక తీరుస్తాను నాన్నా. యిదుగో - ఐ. ఏ.యస్. రిటన్‌లో పాసయ్యా కలెక్టరునవుతా -" శిల్పానికి మళ్ళీ ప్రాణంవచ్చింది.

సుబ్బరామయ్య సంతోషించే స్థితిలో లేడు. ఆయన జీవితంలోనుంచే రిటైరయ్యాడు. ఆయన అటెండెన్సు ఆవేళతో ఆఖరయింది.

శిల్పం మళ్ళీ శిలగా మారింది!